క్లుప్తంగా

మరికల్‌లో 'టీబీ ముక్త్ అభియాన్'



మరికల్: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీపీ, టీబీ, క్షయ, షుగర్, హెచ్‌ఐవీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. క్షయ నిర్ధారణ అయిన రోగులకు ప్రతి నెల రూ.1000 వారి ఖాతాలో ప్రభుత్వం జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అర్చన, రామస్వామి, సువర్ణ, సత్య నారాయణ, చెన్నకేశవులు, ఎస్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట ప్రాథమిక పాఠశాలకు గోపన్‌పల్లికి చెందిన వంశీమోహన్ పాఠశాలకు మైక్‌సెట్‌ను వితరణ చేశారు. బుధవారం పాఠశాల ఉపాధ్యాయులను కలిసి మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల అవస్థలు



మరికల్: యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని తీలేర్ సింగిల్ విండో సొసైటీకి బుధవారం 300 బస్తాల యూరియా వచ్చింది. దీంతో ఆధార్ కార్డులతో తీలేర్ సొసైటీకి చేరుకోగా ఒక టోకెన్‌కు కేవలం మూడు బస్తాల యూరియా మాత్రమే ఇచ్చారు. 300 బస్తాల యూరియా క్షణాల్లో అయిపోవడంతో దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు. తీలేర్ సొసైటీకి ఏటా వానాకాలం సాగు చేసే పంటలకు 200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు కేవలం 10 లారీల ద్వారా 3 వేల బస్తాల యూరియా రావడం విశేషం. దీంతో చేసేంది లేక రైతులు యూరియా కోసం దేవరకద్ర, మరికల్, ఆత్మకూర్, నర్వ తదితర మండల కేంద్రాల్లో ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలను ఆశ్రయించి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

'నానో లిక్విడ్ యూరియా వద్దు'

ధన్వాడ: లిక్విడ్ రూపంలో ఉన్న నానో యూరియా డబ్బాలు తమకు వద్దని పలువురు రైతులు అధికారులతో వాపోయారు. బుధవారం ధన్వాడ ధన్వాడ సింగిల్ విండో కార్యాలయానికి 225 బ్యాగుల యూరియాతో పాటు లిక్విడ్ యూరియా కూడా రావడంతో రైతులకు పంపిణీ చేశారు. అయితే లిక్విడ్‌తో కూడిన యూరియా డబ్బా ధర రూ.268 ఉండటంతో పాటు పిచికారీ చేసేందుకు ఎకరాకు రూ.500 కూలి ఇవ్వాల్సి వస్తుందని, దీని వల్ల తాము నష్టపోతామని తెలిపారు. దీనికి బదులు యూరియా అందజేయాలని కోరగా చేసేదీ లేక యూరియానే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ నవీన్‌కుమార్, సీఈఓ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమగ్ర ఆరోగ్య వైద్యశిబబిరం

దామరగిద్ద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సమగ్ర ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. దమ్ము క్యాన్సర్, దగ్గు, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధులకు ప్రత్యేక వైద్యులతో ఉచిత చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజల ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సోలార్ ప్యానల్ ఏర్పాటుకు పరిశీలన

నారాయణపేట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం ప్రభుత్వ భవనాల పైన సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడంపై ఎంపీడీవో సుదర్శన్, విద్యుత్ శాఖ ఏఈ సాయినాథ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కోటకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం, జెడ్పీ, మండల పరిషత్ స్కూల్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను సందర్శించి సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు కోసం అంచనాలు తీసుకున్నారు.

బస్సులు రావు.. అవస్థలు తప్పవు

- వడ్వాట్–మందిపల్లి గ్రామాలకు బస్సుల నిలిపివేత
- అవస్థలు పడుతున్న ప్రజలు, విద్యార్థులు



బస్సు రాకపోవడంతో ఆటోలో వెళ్తున్న విద్యార్థినులు

మాగనూర్: మండలంలోని పలు గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు నిలిచిపోయాయి. రోడ్డు బాగా లేదు అనే నెపంతో వడ్వాట్, అమ్మపల్లి, అడవిసత్యారం, కోల్పూర్, మందిపల్లి తదితర గ్రామాలకు తిరిగే ఆర్డినరీ సర్వీసులను అధికారులు రద్దు చేశారు. నారాయణపేట డిపో నుంచి ప్రతి రోజు షెటిల్ బస్సు అడవి సత్యారం గ్రామం వరకు నడుస్తుండగా మరో పల్లె వెలుగు మందిపల్లి గ్రామం వరకు నడిచేది. అయితే వారం నుంచి ఈ బస్సులు బంద్ కావడంతో విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు బాగా లేదని సర్వీసులు రద్దు

కొన్నేళ్లుగా ఆయా గ్రామాలకు ఆర్టీసీ సేవలు అందించిన అధికారులు నేడు రోడ్డు బాగా లేదనే కారణంతో మొత్తంగా బస్సు సర్వీసులను రద్దు చేశారు. సింగిల్ రోడ్డు కావడంతో పాటు వర్షాలకు గుంతలు ఏర్పడటంతో నిత్యం బస్సులు మరమ్మతుకు గురవుతుండడంతో బస్సు సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. దీనికి తోడు ఈ మార్గంలో పెద్ద మొత్తంలో ఇసుక టిప్పర్లు నడుస్తుండటంతో సైడ్ కోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని, ఒక వాహనాన్ని తప్పించడానికి 20 నిమిషాలు పడుతుందని బస్సు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల రోడ్లకు మరమ్మతు చేస్తేనే బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందులో విద్యార్థులు..

మందిపల్లి గ్రామంలో కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉంది. కోల్పూర్, అడవిసత్యారం, గజ్జరందొడ్డి, పుంజనూర్, అమ్మపల్లి గ్రామాలలో ఐదో తరగతి వరకు ఉంది. దీంతో పై చదువుల కోసం విద్యార్థులు నిత్యం సుమారు 16 కిలో మీటర్లు ప్రయాణించి వడ్వాట్ గ్రామంలోని జిల్లా పరిషత్తు పాఠశాలకు వస్తుంటారు. అయితే వీరంతా నిత్యం ఈ బస్సులలోనే ప్రయాణం సాగిస్తుండగా బస్సులు నిలిపేయడంతో నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మళ్లీ బస్సును పునఃరుద్ధరించాలని ఆయా గ్రామాల విద్యార్థులు కోరుతున్నారు.

ముందు జాగ్రత్తతోనే బస్సు రద్దు



మాకు ప్రతి గ్రామానికి బస్సు నడపాలని ఉంది. కాకపోతే ప్రస్తుతం వడ్వాట్–మందిపల్లి రోడ్డు గుంతల మయంగా మారడంతో బస్సులు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. వాటికి తోడు ఇరుకు రోడ్డు కావడంతో ప్రజలు కిక్కిరిసి ప్రయాణించడం వల్ల ఏదైన జరగరాని ప్రమాదం జరిగితే భారీ ప్రాణనష్టం వాటిల్లే అవకాశం లేకపోలేదు. వీటిని దృష్టిలో పెట్టుకొని బస్సును రద్దు చేశాం.

– లావణ్య, డిపో మెనేజర్, నారాయణపేట

ప్రజలను అప్రమత్తం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాంకోటి

మరికల్: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాంకోటి అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు రానున్న మూడు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో బుధవారం అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ప్రజలను లోతట్టు, వాగులు, వంకలు, చెరువుల దగ్గరకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. సెలవులను కూడా అధికారులు రద్దు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖాల అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షాలపై సమీక్ష

కొత్తపల్లి/మద్దూరు: రానున్న 72 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అధికారులకు సూచించారు. కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముంపు గ్రామాల్లో అవగాహన కల్పించాలని, వరద బాధితులకు ప్రభుత్వ భవనాల్లో పునరావసం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావ్, విద్యుత్ ఏఈ బాల్‌రాజ్, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు

కోస్గి రూరల్/కృష్ణా: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, విజయలక్ష్మి అన్నారు. తమ ప్రయాణాలను సైతం వాయిదా వేసుకోవాలని లోతట్టు ప్రాంతాలలో ఉండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా ఆపదలో ఉంటే జిల్లా కంట్రోల్ రూం నంబరును 91542 83913 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఏఎస్ఐ ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కార్తీక్ తదితరులు ఉన్నారు.

పంటలపై మందులు పిచికారీ చేయొద్దు

నారాయణపేట: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంటలపై మందులు పిచికారీ చేయొద్దని డీఏఓ జాన్ సుధాకర్ సూచించారు. రానున్న 72 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలలో పొలం నుంచి మురుగునీటిని తీసి వేయాలన్నారు. అలాగే వరి పంటలలో మొక్క వేర్లకు తగినంత గాలి తగిలే విధంగా మురుగు నీటిని తీసివేయాలని, దీర్ఘకాలిక, వరి రకాల నారును 50 రోజుల వయస్సు ఉన్న నారు ఆకు చివరలను తుంచి వేసి కుదురుకు 5 నుంచి 6 మొక్కల చొప్పున నాటుకోవాలన్నారు. వేరుకుల్లు లేదా నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను నివారించడానికి 3 గ్రాముల కాపర్ యాక్సిక్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బన్డిజం + మ్యాంకో జెబ్ శిలీంద్ర నాశక మందును లీటర్ నీటికి కలిపి నెల బాగా తడిచేటట్టు వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువును మొక్క మొదల్లో పాదులు తీసి వేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

నూతన మహిళ సంఘాలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మొగులప్ప

నారాయణపేట: రాష్ట్రంలో నూతన మహిళ సంఘాలను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఓ మొగులప్ప సూచించారు. సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రానికి సమీపంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు రకాలుగా మహిళ సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. 18–60 సంవత్సరాలు ఉన్న మహిళలను సంఘంలో చేర్పించాలన్నారు. దివ్యాంగులతో, వయోవృద్ధులు 60 సంవత్సరాలు పైబడిన మహిళలను, కిషోర బాలికలు 15–18 ఏళ్ల బాలికలనుతో సంఘాలను ఏర్పాటుచేయాలన్నారు. ఈ నెల14 నుంచి 31 వరకు ఈ నూతన సంఘాలను ఏర్పాటు చేయాలని సీసీలు, ఏపీఎంలు, మండల మహిళ సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. ఈ శిక్షణలో డీపీఎం గోవిందు, జడ్ఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి సుజాత, కోశాధికారి అంజమ్మ, మండల సమాఖ్య ప్రతినిధులు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

నారాయణపేట రూరల్: కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించుకుందామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సురేఖ, కన్న శివకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మార్గమ్మ దేవాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేసి మాట్లాడారు. ఈనెల 20 వరకు ప్రతి బస్తీలో, గ్రామ గ్రామాన విశ్వహిందూ పరిషత్ స్థాపక దినోత్సవం నిర్వహించాలని కోరారు. వేడుకలో భాగంగా 16న పతాక ఆవిష్కరణ, పాలవుట్ల కార్యక్రమం ఉంటుందన్నారు.

15న కోటి కుంకుమార్చన

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పాలమూరు ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా ఈనెల 15న కొత్తగంజి బ్రిడ్జి సమీపంలోని శ్రీ నీలకంఠ మల్లికార్జునస్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ అన్నారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

కృత్రిమ మేధపై ప్రత్యేక శిక్షణ



నారాయణపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డిజిటల్ లిటరసీ, కృత్రిమ మేధపై బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మండలాల వారీగా ఎంపిక చేసిన రిసోర్స్ పర్సన్స్ హాజరై వివిధ రకాల యాక్టివిటీస్‌ను చేసి వివరంగా తెలుసుకున్నారు. ఏఎంఓ విద్యాసాగర్ హాజరై డిజిటల్ నైపుణ్యాలు విద్యార్థులకు ఎలా ఉపయోగపడతాయి, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యతను తెలియజేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యారంగంలో ఉపయోగించే మార్గాలపై సవివరంగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, జిల్లా ఆర్పీలు నరేష్, హరిసుధన్, విష్ణువర్ధన్, రవికుమార్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేపట్టామని మాజీ సర్పంచ్ వెంకట్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేష్ అన్నారు. బధవారం పార్టీ కార్యాలయంలో మండల పరధిలోని దుప్పటిగట్టు గ్రామానికి చెందిన సర్కార్ మనీలాకు కుటుంబ సభ్యులకు రూ.56,500 చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతన్నలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.

లయన్స్ క్లబ్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించండి



కోస్గి రూరల్: కోస్గి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాల దృష్ట్యా లయన్స్ క్లబ్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోస్గి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్ గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల కంటి ఆపరేషన్లు చేపడుతున్నామని, ఏటా ఓ పాఠశాలను దత్తత తీసుకొని విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. 500గజాల స్థలాన్ని కేటాయిస్తే మరిన్ని సేవ కార్యక్రమాలు చేసేందుకు వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మేకల రాజేష్, కోడిగంటి హరి, పూర్ణ చంద్ర యాదవ్, నాగులపల్లి శ్రీనివాసులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దామరగిద్ద: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఆమె వెంట ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి, మండల పార్టీ నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్, ఖాజా, రఘు, వెంకట్రామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా పాట ఆవిష్కరణ



నారాయణపేట రూరల్: ఓ త్రివర్ణ పతాకమా.. నీవు ఎగురుతుంటే ఆకాశమే చిన్నబోతోంది.. అంటూ రిటైర్డ్ జీహెచ్ఎం దేవదానం రచించిన పాటను బుధవారం డీఈవో గోవిందరాజు ఆవిష్కరించారు. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ధన్వాడ జడ్పీ బాయ్స్ హెడ్మాస్టర్ నరసింహ చారి సంగీతం అందించి దీనిని రూపొందించారు. ఎంతో సందేశాత్మకతంగా అందించిన పాటను విని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు విద్యాసాగర్, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

డబ్బు.. పరపతి కంటే విద్యే శాశ్వతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: జీవితంలో డబ్బు, పరపతి ఏదీ శాశ్వతం కాదని, మనం చదివిన చదువే శాశ్వతమని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి అన్నారు. నారాయణపేట, మహబూబ్‌నగర్ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్ లో బుధవారం కళాశాల, పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నిస్వార్థ సేవ అనే అంశాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో పాటు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి కష్టపడి చదువుకొని తల్లి దండ్రులు, పుట్టిన ఊరికి గుర్తింపు తీసుకురావాలన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతనే పీజీ పూర్తి చేశానని, పీజీ పరీక్షలో కేవలం 5 మార్కుల తేడాతో ఫెయిల్ అయ్యానని, మళ్లీ మేలో పరీక్ష రాసి పాస్ అయ్యారన్నారు. కానీ ప్రస్తుతం విద్యార్థులు ఫెయిల్ అయితే పూర్తిగా డిప్రెషన్‌కు లోనవుతున్నారని, అలా కాకుండా ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో శౌర్య చక్ర అవార్డు గ్రహీత వెంబు శంకర్, ప్రముఖ గాయకుడు సాయిరాం అయ్యర్, మార్కెట్ యార్డు చైర్మన్ శివారెడ్డి, నారాయణపేట సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు చిట్టెం మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్ణికా రెడ్డికి ఆహ్వానం

నారాయణపేట/నారాయణపేట టౌన్: త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నారాయణపేట–మక్తల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరు కావాలని సభ్యులు ఎమ్మెల్యే పర్ణికా రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 16వ తేదీ నుండి 23 వరకు 8 రోజుల పాటు వేడుకలు జరుపనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా చివరిరోజు ఊరేగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత –ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక నారాయణపేట, మఖ్తల్ ఉత్సవ కమిటీ సభ్యులు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ సంపత్ కుమార్

నారాయణపేట: మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సంపత్ కుమార్ సింగ్ పిలుపునిచ్చారు. ' సే నో టు డ్రగ్స్ ' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరుతూ బుధవారం నారాయణపేట మండలం అప్పక్‌పల్లి దగ్గర ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కరపత్రాలను విడుదల చేసి అనంతరం సిబ్బంది, వైద్య కళాశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. మత్తుకు బానిసైతే మనతో పాటు కుటుంబం నాశనం అవుతుందన్నారు. కళాశాలలో గాని ఆసుపత్రిలో కానీ ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.కిరణ్ ప్రకాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆదిత్య, హెచ్‌ఓడీ డాక్టర్ నజ్మా, ఆర్ఎంఓ డాక్టర్ రాఘవేందర్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన

కొత్తపల్లి: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్న రాణి సూచించారు. మాదక ద్రవ్యాలను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మధుసూదన్ రెడ్డి, భాస్కర్, హేమలత, సంజీవ్, మల్లేశ్, సుల్తానా, మోహన్ రెడ్డి, రాణి విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే జీవితం నాశనం

నారాయణపేట టౌన్: నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో భాగంగా జిల్లా వికలాంగులు, వయో వృద్ధులు మరియు ట్రాంజెండర్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జిల్లాలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాస్ ప్లేడ్జ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ లక్ష్మీకాంత్, సంధ్య మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కళాశాలల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోస్గిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



చెక్కులను పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి

కోస్గి రూరల్: అభివృద్ధిలో వెనకబడిన కోస్గి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. పట్టణంలో రూ.7 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు బుధవారం భూమిపూజ చేశారు. అనంతరం పట్టణంలోని ఏబీకే ఫంక్షన్ హల్‌లో చేపట్టిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు, రామాలయం చౌరస్తా నుంచి సయ్యద్‌పహడ్ దర్గా వరకు రోడ్డు వెడల్పు బాధితులకు పరిహారం చెక్కులను అందించారు. కోస్గి మండలంలో మొత్తం నూతనంగా 1,295 కార్డులు మంజూరు అయ్యాయని, 1,880 కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టామన్నారు. రోడ్డు వెడల్పులో 228 మంది బాధితులు ఉండగా.. అందులో 40 వరకు రోడ్లు, దర్గాలు, ఆలయాలు, ప్రభుత్వ సంస్థలు ఉండగా కోర్టు కేసులు, ఫ్యామిలీ డిస్ట్రిబ్యూషన్లు, సంబంధిత పత్రాలు సమర్పించని వారు ఉన్నారు. 112 మంది లబ్ధిదారులకు రూ.2.47 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. రామాలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభించారు. కడా నిధులు రూ.కోటితో సంపల్లి ప్రాథమిక పాఠశాల నిర్మాణం కోసం భూమిపూజ, రూ.20 లక్షలతో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ, బీసీ కాలనీలో రూ.2.5 కోట్లతో సైన్స్ మ్యూజియానికి, 15 ఫైనాన్స్ నిధుల నుంచి రూ.20 లక్షలతో హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి భూమిపూజ, టీయూఎఫ్ఐడీసీ, కడా నిధులు కలిపి రూ. కోటితో నిర్మించిన బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిచారు. ఇంజినీరింగ్, మహిళా డిగ్రీ కళాశాల, మండలానికి జూనియర్ కళాశాలలు మంజూరు చేసి విద్యాహబ్‌గా చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంచందర్‌నాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఎస్‌ఓ బాల్‌రాం, అర్అండ్‌బీ ఈఈ రాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు, గిరిప్రసాద్‌రెడ్డి, బెజ్జు రాములు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే 'టీఎల్‌ఎం మేళా'



మేళాను పరిశీలిస్తున్న మండల అధికారులు

మాగనూర్: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచడం కోసమే ప్రభుత్వం టీఎల్‌ఎం కార్యక్రమం చేపట్టిందని ఎంఈవో మురళీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన టీఎల్‌ఎమ్ మేళాలో మాగనూర్ మండలంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బోధనాభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఎల్‌ఎమ్‌ను ఉపయోగించడం ద్వారా బోధన సరళీకృతంతో పాటు అర్థవంతంగా ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమంగా ఉన్న పరికరాలకు ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, మండల ఎంఈవో మురళీధర్‌రెడ్డి , కృష్ణ మండల ఎంఈవో నిజాముద్దీన్, ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, దండు శేఖర్, నర్సింహారెడ్డి, తిరుపతి, తిమ్మన్న పాల్గొన్నారు.

ఘనంగా నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో స్వామివారు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని పళ్ల రాఘవేంద్ర స్వామి ఆలయంలో బుధవారం షోడశ బాహు లక్ష్మీనరసింహస్వామి 102 ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జోషి రఘు ప్రేమాచారి సుప్రభాతం సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు నరసింహాచారి, అనిల్ దేశాయి ఆధ్వర్యంలో విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. విద్వాన్ హరీషా చారి ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ నరసింహ స్వామి మహిమలను కొనియాడారు. లక్ష్మీ శోభన భజన మండలి సభ్యులు హరిదాసుల సంకీర్తనలు మధ్య పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర సేవాసమితి సభ్యులు భీంషన్ రావు, అనిరుద్ధ, నరహరి, రాఘవేంద్ర,శేషు,ధరణిధర్, నరసింహ, ప్రహల్లాద, శ్రీహరి, మంజునాథ జోషి పాల్గొన్నారు.